



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



మెట్ట రైతుకు వరం..
ఆయిల్‌పామ్ తోటలు
- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- చిగురుమామిడి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

-చిగురుమామిడి, ఆంధ్రజ్యోతి 6

హెల్మెట్ ఉండదు...
ట్రాఫిక్ రూల్స్ పాటించరు
- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు

- హుజూరాబాద్ రూరల్, ఆంధ్రజ్యోతి 6

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్



- అధికారుల మధ్య సమన్వయ లోపం
- మూడు నెలల్లో వేయి దరఖాస్తుల పరిష్కారం
- పెండింగ్‌లో 68,556 దరఖాస్తులు
- సీడీఎంఏ ఆదేశాలతో కదలిక

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుల క్లియరెన్సు నత్తనడకన సాగుతోంది. ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీంపై ప్రత్యేక దృష్టి పెట్టి మూడు మాసాల్లో పెండింగ్ దరఖాస్తులన్నిటినీ క్లియర్ చేయాలంటూ రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ జూలై 31న ఆదేశాలు జారీ చేశారు. అలాగే అందుకు సంబంధించిన మార్గదర్శ కాలను కూడా విడుదల చేశారు. దీనితో గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలి టీలు, గ్రామపంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తుల క్లియరెన్సులో కదలిక మొదలైంది.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మున్సిపల్, గ్రామ పంచాయతీ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలన చేసి ప్రభుత్వ, చెరువ ,కుంటల పరిధిలోకి ఆయా స్థలాలు రావంటూ క్లియరెన్సు ఇచ్చిన తర్వాతనే ఎల్‌ఆర్ ఎస్ ద్వారా ఫీజులను తీసుకొని క్లియరెన్సు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 68,556 మంది చేసుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని క్లస్టర్లుగా విభజించుకొని అక్టోబర్ నెలాఖరువరకు వాటిని పరిశీలించి ఎల్‌ఆర్‌ఎస్‌కు అర్హత కల వాటిని క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. మిగిలిన వాటిని ఎందుకు తిరస్కరించారనే విషయాన్ని తెలుపుతూ దరఖాస్తుదారులకు సమాచారమివ్వాలని, పెండింగ్ దరఖాస్తులన్నిటినీ క్లియర్ చేయాలని ఆదేశించారు.

అయితే ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ మూడోవారం వరకు కేవలం వేయి దరఖాస్తులు మాత్రమే పరిష్కారానికి నోచుకోగా మున్సిపల్ టౌన్‌ప్లానింగ్‌లో 1500, రెవెన్యూశాఖలో 2,000, నీటిపారుదల శాఖలో 6,390 దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నట్లు సమాచారం. 2020లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు నామ మాత్రంగా వేయి రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో కరీంనగర్ నగరపాలక సంస్థకు 26,850 మంది, హుజురాబాద్ మున్సిపాలిటీలో 3,981 మంది, జమ్మికుంటలో 5,904 మంది, చొప్పదండిలో 1,472 మంది, కొత్తపల్లి మున్సిపాలిటీలో 2,660 మంది ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అలాగే శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ (సుడా)లో 21,162 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌పై కొందరు కోర్టును ఆశ్రయించడంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎల్‌ఆర్‌ఎస్ నిలిచిపోయింది. మున్సిపాలిటీల్లో లే అవుట్ చేయని స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారు కోర్టు తీర్పునకు లోబడి ఉంటామంటూ అఫిడవిట్ దాఖలు చేయడంతోపాటు 14శాతం ఫీజు చెల్లించిన వారికి ప్రభుత్వం ఇళ్లకు అనుమతి ఇస్తూ కొంత వెసులుబాటు కల్పించింది. హౌజింగ్ లోన్ తీసుకునే వారు విధిగా ఇంటి నిర్మాణానికి సంబంధించిన అనుమతి పత్రాన్ని సమర్పించాల్సి ఉండడంతో అలాంటి వారు 14శాతం ఎల్‌ఆర్‌ఎస్ చార్జీలు చెల్లించి అనుమతి తీసుకుంటున్నారు. ఇక 14శాతం పన్నులు చెల్లించలేని వారికి ఫీజు మొత్తాలను చెల్లించి దరఖాస్తులను క్లియర్ చేసుకోవాలని సూచించినప్పటికీ చాలా మంది దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్లియర్ చేయడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు దరఖాస్తుదారులకు మేలు జరుగుతుందని ఆలోచించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాదిరిగానే 14శాతం ఫెనాల్టీ వసూలు చేస్తూ ఎల్‌ఆర్‌ఎస్ పెండింగ్ దరఖాస్తులన్నిటినీ మూడు మాసాల్లో క్లియర్ చేయాలంటూ ఉత్తర్వులు జారీ చేసింది.

డిసెంబర్‌లోగా అర్జీలన్నీ క్లియర్ అయ్యేనా?

అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తాము అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఫెనాల్టీ లేకుండా క్లియర్ చేస్తామని ప్రకటించినందున మళ్లీ గతంలో మాదిరిగా ఫెనాల్టీ వేయడం సరికాదని, ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులన్నిటికీ క్లియర్ చేయాలని ప్రతిపక్షపార్టీలు డిమాండ్ చేశాయి. అయితే ప్రభుత్వం ఫీజు మాఫీ విషయంలో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదుకానీ జిల్లా కలెక్టరేట్లు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో సహాయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలని సూచించింది.

మిగతా 8వ పేజీలో...

కల్యాణ వైభోగమే

- నేత్రపర్వంగా ఉత్సవం
- భక్తులతో పోటెత్తిన యజ్ఞవరాహక్షేత్రం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని యజ్ఞ వరాహస్వామిక్షేత్రం భక్తులతో పోటెత్తింది. క్షేత్రంలో 38వ బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం మోహినీ ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష అలంకరణలు, వివిధ మంగళకర ద్రవ్యాలు, వేద మంత్రాలు, శ్రీవారి నామస్మరణలు, వెల్లువెత్తిన భక్తిపారవశ్యం నడుమ జరిగిన వసుధాలక్ష్మీయజ్ఞవరాహ, రమాసత్యనారాయణ స్వామివారల కల్యాణాలు ఆద్యంతం భక్తులను తన్మయత్వానికి గురిచేశాయి. రాత్రి శ్రీవారు గరుడ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. క్షేత్ర నిర్మాత, ఆధ్యాత్మిక, సంస్కృతభాషా గురువు, పద్మశ్రీ, స్వర్గీయ శ్రీభాష్యం విజయసారథి మంగళాశాసనాలతో ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ, సభ్యులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

- జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత

సుభాష్‌నగర్,అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): అయోడిన్ కలిగిన ఉప్పునే వంటల్లో వాడాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. మంగళవారం ప్రపంచ అయోడిన్ అవగాహన దినోత్సవం సందర్భంగా ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోడిన్ పట్ల ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. అయోడిన్ లోపం వల్ల వచ్చే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. అయోడైజ్డ్ ఉప్పు వాడకం వల్ల సరైన పెరుగుదల, చురుకుదనం, మంచి శారీరక, మానసిక ఆరోగ్యం, జ్ఞాపకశక్తి ఉంటుందని తెలిపారు. అయోడిన్ లోపం వల్ల గర్భస్రావం, మృత శిశు జననం, మరుగుజ్జు తనం, బుద్ధి మాన్యం, గాయిటర్(గొంతువాపు) ఉంటుందన్నారు. ప్రజలు రోజు ఉప్పు వాడకాన్ని 5 గ్రాములకే పరిమితం చేయాలని సూచించారు. ఉప్పు మూత ఉన్న డబ్బాలలో నిల్వ ఉంచాలని, వంట వండిన తరువాతనే ఉప్పును వేయాలని, ఊరగాయలు, పచ్చళ్ళు, అప్పడాల తయారీలో కూడా అయోడిన్ ఉప్పునే వాడాలన్నారు. అయోడిన్ టెస్ట్ కిట్స్ ద్వారా దుకాణాలు, స్కూల్సు, అంగన్ వాడీ సెంటర్లు, గృహ సందర్శన సమయంలో ఉప్పును పరీక్షించడం జరుగుతుందన్నారు. వారం రోజులపాటు తమ సిబ్బంది ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్ సనాజువేరియా, రాజగోపాల్, సరస్వతి, కైక, స్వామి, ఆశా కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

శంకరపట్నం: మహిళలు ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వ హించే ఆరోగ్య మహిళా క్యాంపును సద్విని యోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. మంగ ళవారం శంకరపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య మహిళా కార్యక్రమానికి వచ్చిన మహిళలతో డాక్టర్ సుజాత మాట్లాడుతూ మహిళలకు అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. మొలంగూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, సీహెచ్‌వో భాస్కర్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రతాప్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డీఏ, పీఆర్‌సీ అమలు చేయాలని ఉపాధ్యాయుల నిరసన

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం డీఏ, పీఆర్‌సీ అమలు చేయాలని ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్య దోరణిపై రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. దీనితో జిల్లాలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్ట రాజేశ్వర్, అన్నమనేని తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి అంబటి వేణుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యా యులు అనేక ఆశలు పెట్టుకుంటే పది నెలలుగా మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా డీఏ, పీఆర్‌సి, పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు డీఏలతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 28.న తహసీల్దార్లకు వినతిపత్రాల సమర్పణ, నవంబర్ 5న కలెక్టరేట్ల ముందు ధర్నా, చివరగా నవంబర్ 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షను చేపడతామని వారు పేర్కొన్నారు. నిరసన కార్యక్రమాల్లో తపస్ నాయకులు ఎ.సంపత్‌కుమార్, వి.కరుణాకర్‌రావు, కె.హరిచరణ్, బి.పవన్‌కుమార్, కె.శారద, అనురాధ, శ్రీదేవి, ఝాన్సీరాణి, వనితాకుమారి, పలువురు జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారని తెలిపారు.

డీఏ ప్రకటించకుంటే ఉద్యమిస్తాం : టీపీటీయూ

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, లేనిపక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయులందరితో కలిసి ఉద్యమిస్తామని, ఇందుకు ఉద్యోగులంతా సిద్ధంగా ఉండాలని టీపీ టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.సారయ్య ఒక ప్రటకలో అన్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ కుబేర్‌లో జీపీఎఫ్, లోన్, సరెండర్ బిల్లులు సంవత్సరాలుగా పెం డింగ్‌లో ఉండడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త పీఆర్‌సీపై ఉద్యోగ, ఉపాధ్యాయులతో చర్చలు జరిపి ప్రకటించాలని, డీఏలన్నిటినీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే 'గంగుల'కు మాతృవియోగం



లక్ష్మీనర్సమ్మ (ఫైల్)

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల లక్ష్మీనర్సమ్మ మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీనర్సమ్మ మంగళవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమెకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మీనర్సమ్మ మృతదేహాన్ని క్రిస్టియన్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసానికి తీసుకురాగా ఆమె భౌతికకాయాన్ని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి లక్ష్మీనర్సమ్మ మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కాగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విదేశాలకు వెళ్లడంతో బుధవారం లక్ష్మీనర్సమ్మ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ముందుకు సాగాలి : డీఈవో

గంగాధర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా ముందుకు సాగాలని డీఈవో జనార్ధన్‌రావు అన్నారు. మంగళవారం గంగాధర ప్రభుత్వ పాఠశాలను ఆయన సంద ర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థిలోని నైపుణ్యాలను పసిగట్టి ఆ దిశగా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు షూ, యూనిఫాంలపై వివరిస్తూ క్రమశిక్షణ అల వర్చుకుంటే సమాజంలో ఎదుగుతారన్నారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న సమ్మెటివ్ పరీక్షలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు

విద్యార్థులను ఆకట్టుకున్న 'ఓపెన్‌హౌజ్'

- పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేక స్టాల్స్‌లో ఆయుధాల ప్రదర్శన
- వెయ్యి మంది విదార్థులకు సీపీ సమక్షంలో అవగాహన
- స్నిఫర్ డాగ్, నార్కోటిక్ డాగ్ విన్యాసాలు...

కరీంనగర్ క్రైం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా కమిషనరేట్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో పోలీసుశాఖ మంగళవారం ఏర్పాటు చేసిన 'ఓపెన్ హౌజ్' విద్యార్థులను ఆకర్శించింది. ఉదయం పోలీస్ కమిషనర్



పోలీసు ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో ఆయుధాల పనితీరును విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీపీ అభిషేక్‌మోహంతి, పోలీసులు

అభిషేక్ మోహంతి ప్రారంభించి విద్యార్థులకు దగ్గరుండి ఆయుధాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ ఓపెన్‌హౌజ్ కార్యక్రమంలో కరీంనగర్‌లోని పలు పాఠశాలలు, కళాశాలలకు చెందిన దాదాపు 1,000మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులం సందర్శనార్థం పోలీస్ శాఖలోని వివిధ విభాగాల పనితీరును తెలిపే విదంగా పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఆయుధాలు, డాగ్స్, షీటీం, నార్కోటిక్ విభాగం పలు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్స్‌లో పోలీసలు నిత్యం ఉపయోగించే వివిధ రకాల తుపాకులు, గ్రినేడ్స్, టెలిస్కోప్, మెటల్ డిటెక్టర్ వంటివి ప్రదర్శించారు. పోలీసు జాగిలాల ప్రదర్శన, సైబర్ క్రైం, యాంటి నార్కోటిక్ సెల్, షీటీమ్, ట్రాఫిక్ పోలీసుల పనితీరు. అల్లరి మూకలను చెదరగొట్టేందుకు వినియోగంచే స్మోక్ గన్‌లు, వజ్ర వాహనాలను, కమాండ్ కంట్రోల్ వాహనాలను ప్రదర్శన కోసం మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ ఓపెన్ హౌజ్ కార్యక్రమంలో ప్రధానంగా డాగ్స్ ప్రదర్శించిన విన్యాసాలు విద్యా ర్థులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఈ నెల 30 వరకు కొనసాగుతాయన్నారు. ఇందులో భాగంగా సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(శాంతి భద్రతలు) ఎ లక్ష్మీనారాయణ, అడిషనల్ డీసీపీ(ఎఆర్) అనోక్ జయ్‌కుమార్‌లతో పాటు, ఏసీపీలు పాల్గొన్నారు.

షీటీంకు యాప్ ద్వారా ఫిర్యాదు విధానం నేర్చుకున్నాం...

- టి అనన్యరెడ్డి, ఇంటర్ విద్యార్థిని, ఆల్‌ఫోర్స్ కళాశాల



పోకిరీల వేధింపులపై పోలీసుల వద్దకు వెళ్లకుండా యాప్ ద్వారా ఎలా ఫిర్యాదు చేయాలనేది షీటీం పోలీసులు అవగాహన కల్పించారు. సోషల్‌మీడియా ద్వారా వచ్చే అనవసరపు లింక్‌లను ఓపెన్ చేస్తే తలెత్తే సైబర్ మోసాలు, నేరాల గురించి వివరించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ఏర్పాటు చేసిన ఓపెన్‌హౌజ్ ద్వారా పోలీసుల విధులు, ఆయుధాల పనితీరును తెలుసుకున్నాం. పోలీసు డాగ్ విన్యాసాలు ఆకర్శించాయి.

మత్తు పదార్థాలతో అనర్థాలు

- పి సాయిరాం, పాఠశాల విద్యార్థి, మానేరు సెంట్రల్ స్కూల్



గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో వచ్చే దుష్పరిణామాలను ఓపెన్ హౌజ్‌లో పోలీసులు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ ఏ విధంగా నాశనం అవుతుందనేది అధికారులు వివరించారు. వివధ రకాల ఆయుధాలు, వాటి విశిష్టతల గురించి తెలుసుకున్నాం. మైనర్‌లు వాహనాలు నడపటం వల్ల కేసులు, సైబర్ క్రైం తదితర విషయాలపై అవగాహన కలిగింది.





చిగురుమామిడి నర్సరీలో పెరుగుతున్న ఆయిల్ పామ్ మొక్కలు

ఆయిల్‌పామ్ తోటలు మెట్ట రైతుకు వరంగా మారనున్నాయి. తక్కువ పెట్టుబడితో, తక్కువ నీటితో ఈ పంట సాగు చేయవచ్చు. మరోవైపు అంతరపంటగా ఇతర పంటలు సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చు. చిగురుమామిడిలో ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ నర్సరీ నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మొక్కలు సరఫరా చేస్తున్నారు.

మెట్ట రైతుకు వరం..
ఆయిల్‌పామ్ తోటలు

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి
- అంతర పంటలతో అదనపు ఆదాయం
- చిగురుమామిడి నర్సరీలో ఆయిల్‌పామ్ మొక్కలు

చిగురుమామిడి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పంట వేయాలన్నా కోతుల బెడద తీవ్రంగా ఉన్నది. దీంతో రైతులు వరి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు. మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు కొరత ఏర్పడినపుడు వరి పంట ఎండిపోయి తీవ్రంగా నష్టం జరుగుతోంది. ముఖ్యంగా యాసంగి సాగులో రైతులు సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టపోతున్నారు. మెట్ట రైతులకు అనుకూలంగా ఉండేందుకు ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తోంది. కొందరు రైతు పంట సాగుకు ముందుకు వస్తున్నారు.

● ఎకరంలో 57 మొక్కలు

ఎకరానికి 57 మొక్కలు నాటవచ్చు. ఎకరం వరి పంటకు కావాల్సిన నీటితో నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట సాగుచేయవచ్చు. తక్కువ కూలీల ఖర్చు ఉంటుంది. ఆయిల్ పామ్ సాగుచేస్తున్న తోటలో అంతర పంటలు వేసుకుంటున్న రైతులకు ఎరువులకు, ఇతర ఖర్చులకు సంవత్సరానికి 4,200 రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుంది. ఎకరంలో 10 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు చెపుతున్నారు. గతంలో టన్ను ధర 14,000 రూపాయలు ఉండేది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ తోటలకు ప్రోత్సాహం ఇస్తూ టన్ను ధర 17,000 రూపాయలకు పెంచింది.

● సబ్సిడీపై డ్రిప్ పంపిణీ

గత ప్రభుత్వంలో పామాయిల్ సాగుకు సబ్సిడీపై డ్రిప్ ఇవ్వలేదు. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు వందశాతం సబ్సిడీతో డ్రిప్ అందిస్తున్నారు. బీసీ ఇతర సామాజిక వర్గాలకు 90శాతం సబ్సిడీపై డ్రిప్ ఇస్తున్నారు. ప్రతి రైతు 20 రూపాయాలతో ఒక మొక్క పొందవచ్చు. మొక్కధర 200 రూపాయలు ఉండగా ప్రభుత్వం 180 రూపాయల సబ్సిడీ అందిస్తోంది. ఆయిల్‌పామ్ మొక్కలు పెంచాలనుకునే రైతులు ధ్రువపత్రాలతో వ్యవసాయశాఖ అందికారులను సంప్రదించాల్సి ఉంటుంది.

తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ తోటలు పెంచవచ్చు

– గొర్ల పరమేశ్వర్, రైతు, బొమ్మనపల్లి

అన్ని పంటలకన్నా అయిల్ పామ్ తోటలు తక్కువ పెట్టుబడితో పెంచవచ్చు. సాగునీటి కొరత ఉన్న ప్రాంతంలో ఈ మొక్కలు పెంచితే లాభదాయకం. అధికారులు రైతులకు మరింత అవగాహన కల్పించి అయిల్ పామ్ తోటలు పెంచేలా ప్రోత్సహించాలి.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి

-జనవేని రాజమల్లు, రైతు, ఉల్లంపల్లి

సరైన మార్కెటింగ్ సౌకర్యం ఉంటే అన్ని పంటల కన్నా ఆయిల్ పామ్ సాగు చాలా సులభం. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడి ఉంటుంది. కోతుల బెడద ఉండదు. పంటలకు ప్రభుత్వాలు మరింత ప్రోత్సాహం ఇవ్వాలి. అంతర పంటగా అన్ని రకాల పంటలు సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చు. పంట సాగుకు రైతులు ముందుకు వస్తే మార్కెటింగ్ సౌకర్యం ఉంటుంది.

చిగురుమామిడిలో రైతకు అవగాహన కల్పిస్తున్న ఫీల్డ్ ఆఫీసర్ మ్యాదరబోయిన ప్రవీణ్



అక్రమ కట్టడాల కూల్చివేత

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం నగునూర్‌లో ప్రభుత్వ స్థలంలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది కూల్చి వేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 669 ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు పిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరు మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు ఆర్ఐ కనకరాజు, కార్యదర్శి లచ్చయ్య ఆధ్వర్యంలో సిబ్బంది కూల్చివేశారు.

రూ. 6,800 పలికిన పత్తి ధర


జమ్మికుంట రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 196 మంది రైతులు 1,630క్వింటాళ్ల విడి పత్తి, 15 మంది రైతులు 26 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై ఆర్టీసి బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నల్లగొండ గ్రామానికి చెందిన జింక మల్లేశం కరీంనగర్ వైపునకు తన ద్విచక్ర వాహనంపై వెలుతుండగా ఇందిరానగర్ వద్ద వెనుక నుంచి ఆర్టీసి బస్సు ఢీకొట్టి వెళ్లిపోయింది. ద్విచక్ర వాహనం పైనుంచి మల్లేశం కిందపడటంతో గాయాలు కాగా స్థానికులు గమనించి కరీంనగర్ అనుపత్రికి తరలించారు.

తాళం పగులగొట్టి చోరీ

జమ్మికుంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గాకాలనికి చెందిన బోగం లక్ష్మి ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. లక్ష్మి ఈ నెల 18న ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంటి సమీపంలో ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి ఇంటి వైపు చూడమని చెప్పింది. మంగళవారం ఉదయం ఇంటి తాళం తీసి ఉండటాన్ని గమనించిన కుమార్తె తల్లికి సమాచారం అందించింది. హుటాహుటిన వచ్చిన తల్లి ఇంట్లోకి వెళ్లి చూడగా, నగదు, వెండి, బంగారం ఆభరణాలు చోరీకి గురైనట్లు గమనించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రవికుమార్ తెలిపారు.



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కారుతో ఢీ కొట్టి.. కత్తితో పొడిచి..

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణ హత్య - కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ధర్నా

- హత్యకు రాజకీయ కక్షలే కారణమంటూ ఆరోపణ



మారు గంగారెడ్డి(ఫైల్)

జగిత్యాల క్రైం/జగిత్యాల రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి(58) మంగళవారం దారుణ హత్యకు గురయ్యాడు. కారుతో ఢీ కొట్టి.. కత్తితో విచక్షణా రహితంగా పొడిచి హత్య చేశారు. ఈ ఘటన జగిత్యాల జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం జాబితాపూర్‌లో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. జాబితాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ, జీవన్‌రెడ్డికి రాజకీయంగా అనుచరుడిగా పేరున్న మారు గంగారెడ్డి మంగళవారం ఉదయం గ్రామ కూడలిలో దారుణ హత్యకు గురయ్యాడు. ద్విచక్ర వాహనంపై వెళుతున్న గంగారెడ్డిని అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్‌గౌడ్ అనే యువకుడు కారుతో వెనుకనుంచి ఢీ కొట్టాడు. అదుపు తప్పి కింద పడిన గంగారెడ్డిని అందరూ చూస్తుండడానే కత్తితో చాతితో పాటు కడుపులో విచక్షణా రహితంగా పొడిచాడు. అనంతరం వేరే కారులో తన అనుచరులతో కలిసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన గంగారెడ్డిని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జీవన్‌రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు.

● మూడు గంటలకు పైగా ఆందోళన...

గంగారెడ్డి హత్య విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. హత్యకు ఇటీవల చేరిన కాంగ్రెస్ నాయకుడే కారణం అంటూ ఆరోపించారు. జగిత్యాల-ధర్మపురి ప్రధాన రహదారి ఇందిరా చౌక్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బైఠాయించి ఆందోళన చేపట్టారు. నిందితుడిని పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సైతం ధర్నాలో పాల్గొని పోలీసుల తీరుపై మండిపడ్డారు. దీంతో ఎస్పీ అశోక్‌కుమార్ రంగప్రవేశం చేసి విప్‌తో పాటు ఎమ్మెల్సీతో గంటకు పైగా మంతనాలు జరిపారు. హత్యకు పాల్పడ్డ నిందితుడిని పట్టుకుని శిక్షిస్తామని హామీఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● దసరా పండుగ నుంచే స్కెచ్..

గంగారెడ్డిని హత్య చేసేందుకు అదే గ్రామానికి చెందిన బత్తిని సంతోష్ దసరా పండుగ నుంచే స్కెచ్ వేసినట్లు గ్రామంలో ఇటీవల జరిగిన సంఘటనలు చెబుతున్నాయి. గంగారెడ్డి గ్రామంలో ఏ సమస్య ఉన్నా పెద్ద మనిషిగా వ్యవహరించేవాడు. సంతోష్‌గౌడ్‌కు తన కుటుంబసభ్యులకు భూసమస్యలు ఉన్నాయి. ఈవిషయంలో గంగారెడ్డి పెద్ద మనిషిగా తనకు వ్యతిరేకంగా ఉన్నాడని కక్ష పెంచుకున్నట్లు తెలిసింది. అంతేకాకుండా ఇటీవల బతుకమ్మ, దసరా పండుగల వేడుకల్లో సైతం సంతోష్‌గౌడ్‌కు గంగారెడ్డికి మధ్య స్వల్ప వివాదాలు చోటుచేసుకున్నాయి. ఇదే కారణంతో రాజకీయంగా గంగారెడ్డి ఉనికి లేకుంగా చేసేందుకు కొంతమంది స్కెచ్ వేసి సంతోష్ గౌడ్‌తో హత్య చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● సీఎంవో, సీఎస్ దృష్టికి తీసుకెళ్లిన అడ్లూరి...

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారు గంగారెడ్డి హత్యకు గురైన సంఘటను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లారు. సీఎం కార్యదర్శితో పాటు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి కాంగ్రెస్ నాయకుడి హత్య గురించి వివరించారు. హత్య ఉదంతంపై పోలీసుల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకుడికి ప్రాణభయం ఉందనే విషయాన్ని పోలీసుల దృష్టికి ముందుగానే తీసుకెళ్లినా రక్షణ కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

● మీపార్టీకి.. మీకూ ఓ దండం..

కాంగ్రెస్ నాయకుడి హత్య విషయాన్ని తెలుసుకున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ హైదరాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ పీసీసీ చీఫ్‌పై అసహనం వ్యక్తం చేశాడు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితానికి కాంగ్రెస్ పార్టీ మంచి బహుమతి ఇచ్చిందన్నారు. 'మీ పార్టీకి... మీకు ఓ దండం అంటూ.. మీ పార్టీలో నేను ఇక ఉండనూ.. ఇకనైనా బతకనివ్వండి' అంటూ ఫోన్ కట్ చేశారు.

● హత్యను ఖండించిన ఎమ్మెల్యే సంజయ్ ..

కాంగ్రెస్ నాయకుడి హత్యపై హైదరాబాద్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పందించారు. హత్యను తీవ్రంగా ఖండించారు. హత్యకు పూర్తి కారణాలు తెలుసుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్‌ను ఆదేశించారు. నిందితులను, హత్యలో ప్రమేయం ఉన్న ఏఒక్కరినీ వదలొద్దని ఆదేశించారు. హత్యను రాజకీయకోణంలో చూడడం బాధాకరంగా ఉందన్నారు.

● వీఎస్ఎస్ చైర్మన్ నుంచి ...

జాబితాపూర్ గ్రామానికి చెందిన మారు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో మంచి కార్యకర్తగా గుర్తింపు తెలచ్చుకున్నాడు. 40 ఏళ్ల కాలంలో వన సంరక్షణ సమితి అధ్యక్షుడి నుంచి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీతో పాటు జీవన్‌రెడ్డి ప్రధాన అనుచ రుడిగా గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇటీవల జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడి జాబితాలో గంగారెడ్డి పేరు కూడా ఉన్నట్లు వార్తలు వచ్చాయి.

● పోలీసుల అదుపులో నిందితుడు?

గంగారెడ్డిని హత్యచేసి పారిపోయిన నిందితుడు బత్తిని సంతోష్ గౌడ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సంతోష్‌గౌడ్‌కు ఈ హత్యకు ఒక్కడికే సంబంధం ఉందా..? హత్యకు పాల్పడిన అనంతరం సంతోష్ గౌడ్ మరో కారులో పారిపోయిన సమయంలో మరో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఉన్నట్లు స్థానికులు అనుమానించడం వారికి సంబంధం ఉందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. హత్య చేసిన అనంతరం నిందితుడు తన ఫోన్‌ను కొద్ది దూరంలో పడేసి వెళ్లడం.. హత్యకు కొద్దిరోజుల ముందు జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి బయటకు వస్తున్న దృశ్యాలను రీల్ చేసి సోషల్ మీడియాలో పెట్టడం చూస్తుంటే ఈ హత్య పక్కా స్కెచ్ ప్రకారమే చేసినట్లు తెలుస్తోంది. హత్యకు పాల్పడ్డ నిందితుడు సంతోష్‌గౌడ్ పై రౌడీ షీట్ కేసుతో పాటు గంజాయి సేవిస్తూ జులాయిగా తిరిగే వ్యక్తిగా పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. హత్య సంచలనంగా మారగా పోలీసులు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా భారీ బందోబస్తు నిర్వహించారు. జాబితాపూర్ గ్రామంతోపాటు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల, ఇందిరా చౌక్‌కు భారీగా పోలీసులు మోహరించారు. డీఎస్పీ, సీఐ, ఎస్సైలు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఆధార్, పాన్ కార్డ్‌లో ఫొటో మార్ఫింగ్

- బ్యాంకులో రూ. 20 లక్షల రుణం

- సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితుడి ఆవేదన



ఫేక్ డాక్యుమెంట్స్ చూపుతున్న నారాయణ

బుగ్గారం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆధార్, పాన్‌కార్డులోని తన ఫొటోలను మార్ఫింగ్ చేసి కేటుగాళ్లు బ్యాంకులో రూ. 20లక్షల రుణం తీసుకున్నారని ఓ బాధితుడు రెండు రోజుల క్రితం ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బుగ్గారం మండలం మద్దునూరు గ్రామానికి చెందిన రైతు ముంజాల నారాయణ జగిత్యాలలోని ఓ బ్యాంకులో పంట రుణం కోసం వెళ్లాడు. బ్యాంకు అధికారులు మీ పేరు మీద హైదరాబాద్‌లో ఏడు ప్రైవేటు బ్యాంకుల్లో సుమారు రూ. 20లక్షల రుణం ఉన్నట్లు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఆయా బ్యాంకులకు వెళ్లి ఆరా తీయగా తన ఆధార్, పాన్ కార్డులోని ఫొటోలను మార్ఫింగ్ చేసి రుణం తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌ను బాధితుడు కోరాడు. బాధితుడు నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మూడేళ్ల క్రితం హైదరా బాదు నుంచి ఎస్‌బీఐ బ్యాంకు ఉద్యోగులు నారాయణకు తరచుగా కాల్ చేసి క్రెడిట్ కార్డు బిల్లు రూ. 4 లక్షలు కట్టాలని ఒత్తిడి చేసేవారు. తాను ఎలాంటి లోన్ తీసుకోలేదని హెచ్చరించడంతో అప్పటి నుంచి కాల్స్ చేయడం మానేశారు. నాలుగు నెలల నుంచి మళ్లీ బ్యాంక్ నుంచి కాల్స్ రావడంతో ఇతరులకు సంబంధించిన ఫోన్లు తనకు వస్తున్నాయేమో అని నారాయణ అపోహ పడి అధికారులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిన సమయంలో నారాయణకు పంట రుణం మాఫీ కావడంతో జగిత్యాలలోని కెనరా బ్యాంకులో క్రాప్ లోన్ కోసం వెళ్లడంతో అసలు విషయం బయటపడింది. నారాయణ పేరుమీద అప్పటికే రూ. 20 లక్షల లోన్ ఉందని, వాటికి సంబంధించిన కిస్తీలు కడ్డటం లేదని బ్యాంకు అధికారులు తెలపడంతో నారాయణ అవాక్కయ్యాడు. వెంటనే జగిత్యాలలోని సైబర్ క్రైమ్ వారికి ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని దీనితో గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. స్పందించిన కలెక్టర్ సైబర్ క్రైమ్ వాళ్లకి రిఫర్ చేశారని బాధితుడు నారాయణ తెలిపాడు.

హెల్మెట్ ఉండదు...
ట్రాఫిక్ రూల్స్ పాటించరు

- ప్రమాదాలబారిన ద్విచక్రవాహనదారులు
- రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువతే బాధితులు
- దిక్కుతోచని స్థితిలో కుటుంబాలు



హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. వాహనదారులు నిబంధనలు పాటించకపోవడంతో తమ జీవితాలతో పాటు కుటుంబాలను అంధకారంలోకి నెడుతున్నారు. ముఖ్యంగా యువత వేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలుకొని తెచ్చుకుంటున్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎక్కువ మంది జీవితాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో అధికశాతం ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారే అధికంగా ప్రమాదాలు భారిన పడుతుండటంతో వారి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రమాద తీవ్రత పెరుగుతోందని పోలీసులు చెపుతున్నారు.

మచ్చుకు కొన్ని...

➡ ఈ నెల 21న తుమ్మన్నపల్లి గ్రామంలోని ఎస్సారెస్పీ బ్రిడ్జ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జూనియర్ లైన్‌మెన్ హెల్మెట్‌ను ధరించకపోవడం మూలంగా తలకు బలమైన గాయం కావడంతో అక్క డికక్కడే మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ స్టేజి వద్ద హుజూరాబాద్ పట్టణంలోని మర్బాల్ షాపు యాజమాని, ఆర్ఎంపీ వైద్యుడు ద్విచక్ర వాహనంపై హుజూరాబాద్‌కు వస్తున్న క్రమంలో యూటర్న్ వద్ద ఎదురుగా మరో వాహనం రావడంతో వాహనం అదుపు తప్పింది. సదరు వ్యక్తి హెల్మెట్ ధరించకపోవడంతో తలకు బలమైన గాయం కావడంతో ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందాడు.

➡ హుజూరాబాద్ మండలం తుమ్మన్నపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి ద్విచక్ర వాహనదారుల మృత్యువులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. ఎన్‌హెచ్‌ఐ-563 పనుల కోసం వచ్చిన ఉపాధి హామీ కూలీలిద్దరూ తమ సొంత ఊరికి వెళ్లి తిరిగి పనులు జరిగే చోటికి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఎదరుగా వచ్చి ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ● తుమ్మన్నపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు విధుల్లో పాల్గొనేందుకు హుజూరాబాద్ పోలీస్ స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై బయల్దేరగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొ ట్టడంతో తల భాగానికి తీవ్ర గాయాలు కావడంతో కుటుంబం రోడ్డున పడింది.



కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై హెల్మెట్ లేకుండా వాహనాలను నడుపుతున్న ద్విచక్రవాహనదారులు (ఫైల్)

ప్రమాద బీమాపై అవగాహన కరువు

రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలా మంది జీవితాలే అర్ధంతరంగా ముగుస్తున్నాయి. దీంతో వారి కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ పోషకుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబ సభ్యుల పరిస్థితి అగమ్యగోచారంగా మారుతుంది. వాహనలు నడిపే ప్రతి వ్యక్తి బాధ్యతగా ప్రమాద బీమా తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణించినా.. అంగవైకల్యం వచ్చినా బీమా ఆదుకునే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి ప్రజల కోసం ప్రవేశపెట్టిన బీమా పథకాలపై అవగాహన లేక వాటిని కోల్పోతున్నారు.

ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలి

- కంచె వేణు,ఎంవీఐ, హుజూరాబాద్



వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలి. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా ప్రమాదాలు జరిగే అస్కారం చాలా తక్కువ. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు బయటికి తీస్తున్న క్రమంలోనే హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తే.. అనుకొని ప్రమాదం ఏర్పడితే హెల్మెట్ ద్వారా తలబాగాన్ని కాపాడుకోవచ్చు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువతి మృతి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వట్టివాగు వద్ద ఈ నెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయలై చికిత్స పొందుతున్న కోరుట్ల పట్టణానికి చెందిన నీలం హిమశ్రీ(22) అనే యువతి సోమవారం రాత్రి మృతి చెందింది. సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న నీలం ప్రవీణ్ తన కూతురు హిమశ్రీని బైకుపై ఎక్కించుకోని మెట్‌పల్లి వస్తున్నాడు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద బ్రిడ్జిపై మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొనడంతో ఇద్దరిరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ హిమశ్రీ సోమవారం రాత్రి మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు, లారీ డ్రైవర్లపై కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

తంగళ్లపల్లి, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): అప్పులు, కుటుంబ కలహాలతో నేత కార్మికుడు మానేరు వాగులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. మండలంలోని మండెపల్లి కేసీఆర్ నగర్‌కు చెందిన ఆడెపు తిరుపతి (40) తంగళ్లపల్లిలోని మానేరు వంతెన పైనుంచి వాగులోకి దూకే ప్రయత్నం చేస్తుండగా భార్య అడ్డుకుంది. ఘటను అటువైపుగా వెళ్తున్న వాహనాదారు గమనించి తిరుపతిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిపై దాడికి దిగడంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు తిరుపతికి నచ్చజెప్పి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పులు, కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు యత్నించినట్లు తిరుపతి పోలీసులకు తెలిపాడు. కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఏఎస్సై చంద్రమౌళి తెలిపారు.

'శాతవాహన' సమాచారం

సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను

రెగ్యులర్ కోర్సులుగా మార్చాలి

- ఎస్‌యూ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య



వీసీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్‌యూ జేఏసీ నాయకులు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చాలని, పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలని, కొత్త కోర్సులకు అవకాశం కల్పించాలని ఎస్‌యూ వైస్ చాన్సలర్‌ను మంగళవారం శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల చైతన్య కోరారు. నూతనంగా శాతవాహన యూనివర్సిటీ ఉపకులపతిగా నియమితులైన ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్‌ని శాతవాహన జేఏసీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను, రెగ్యులర్ కోర్సులుగా మార్చి నూతన కోర్సులను తీసుకువచ్చి పీహెచ్‌డీ ప్రోగ్రాంను ప్రారంభించాలన్నారు. అలాగే యూనివర్సిటీని పటిష్ఠం చేయాలని కోరారు. టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌యూ జేఏసీ నాయకులు శనిగారపు అరుణ్ కుమార్, నైతం మహేష్, సత్యనారాయణ, రమేష్, తిరుపతి, అనిల్, శ్రీకర్, రవి పాల్గొన్నారు.

29 నుంచి బీఫార్మసీ పరీక్షలు

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌యూ పరిధిలో బీఫార్మసీ మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 29వ తేదీ నుంచి, మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు 30నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షలు (సప్లిమెంటరీ) ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రెండు, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ((రెగ్యులర్, సప్లిమెంటరీ) మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎమ్మెస్సీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబరు 2024లో నిర్వహించిన ఎంఎస్సీ రెండో, నాలుగో సెమిస్టర్ గణితం (బ్యాక్‌లాగ్) పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఈ ఫలితాలు శాతవాహన వెబ్సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి ఎస్‌యూ అంతర డిగ్రీ కళాశాలల క్రీడా పోటీలు

● షెడ్యూల్‌ను ప్రకటించిన స్పోర్ట్స్ బోర్డు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ కరీంనగర్ అంతర డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడా పోటీల షెడ్యూల్ బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. ఈ మేరకు శాతవాహన యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నజీముద్దీన్ క్రీడా షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ క్రీడా పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను శాతవాహన యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపికైన శాతవాహన యూనివర్సిటీ జట్టు దక్షిణ భారత అంతర యూనివర్సిటీ క్రీడా పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఖో-ఖో క్రీడాంశాల్లో పోటీలతోపాటు ఎంపికలను నిర్వహించనున్నారు. మిగతా క్రీడాంశాల్లో నేరుగా ఎంపికలను నిర్వహిస్తామని ప్రకటించారు.

●క్రీడల షెడ్యూల్ ఇలా..

ఈ నెల 23న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో కబడ్డీ పోటీలను పురుషుల విభాగంలో నిర్వహిస్తారు. 24న శాతవాహన యూనివర్సిటీ కళాశాల మైదానంలో మహిళలకు కబడ్డీ పోటీలను నిర్వహిస్తారు. 25న కరీంనగర్ కార్ఖానగడ్డలోని డైనమిక్ జిమ్‌లో మహిళలకు, పురుషుల విభాగాల్లో వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 26న కరీంనగర్ లారా జూడో అకాడమీలో మహిళలు, పురుషుల విభాగాల్లో జూడో క్రీడాంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. నవంబర్ 1న కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో మహిళలు, పురుషుల విభాగాల్లో ఆర్చరీ అంశంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 2న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో మహిళల విభాగంలో వాలీబాల్ క్రీడాపోటీలను నిర్వహించనున్నారు. 4న కరీంనగర్ వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల క్రీడా మైదానంలో పురుషుల విభాగంలో వాలీబాల్ పోటీలను నిర్వహిస్తారు. 6న శాతవాహన యూనివర్సిటీ మైదానంలో పురుషుల విభాగంలో ఖో-ఖో పోటీలను, 7న మహిళల విభాగంలో ఖో-ఖో పోటీలను నిర్వహించనున్నారు. 13న శాతవాహన యూనివర్సిటీ క్రీడా మైదానంలో మహిళలు, పురుషుల విభాగంలో అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహిస్తారు. 14న యూనివర్సిటీలో క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహిస్తారు.



చారిత్రక ఖిల్లా

పర్యాటక ప్రాంతాలు, చారిత్రక కట్టడాలు మనసుకు నూతనోత్తేజాన్ని అందించడంతో పాటు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి. జగిత్యాల జిల్లా కేంద్రంలో గల చారిత్రక ఖిల్లా కూడా పర్యాటకులను ఆకర్షించడంతో పాటు ఆలోచింపజేస్తోంది. జగిత్యాల పట్టణంలోని కోట, తెలంగాణ టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రంగా ఖిల్లా గుర్తింపు పొందింది. వందల ఏళ్ల నాటి కట్టడం చెక్కు చెదరకుండా ఉండటం విశేషం. ఖిల్లా కారణంగానే జగిత్యాలకు ఆ పేరు వచ్చిందని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

- టూరిజం మ్యాప్‌లో మెరిసే నక్షత్రం
- ఐరోపా కోటతో పోలికలు
- రాష్ట్రంలో ఉన్న ఏకైక నక్షత్రాకారం కోట
- శత్రుదుర్భేద్యంగా ప్రత్యేక గదులు, కందకాలు, బావి, సొరంగం
- పర్యాటక శాఖ ఆదరిస్తే మరింత గుర్తింపు

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలో చారిత్రక కట్టడమైన జగిత్యాల ఖిల్లాను క్రీ.శ 1747లో ఎలగందుల కోటకు అధిపతిగా ఉన్న ముబారీ జాల్‌ముల్క్ జాఫరుదౌలా, మీర్జా ఇబ్రహీంఖాన్ 20 ఎకరాల విస్తీర్ణంలో ఖిల్లాను నిర్మించారు. 17వ శతాబ్దంలో ఇద్దరు యూరోపియన్ ఇంజనీర్లు జాక్, తాల్ ఈ ప్రాంతంలో నీటితో చుట్టుముట్టబడిన ఒక అందమైన నక్షత్ర ఆకారపు కోటను నిర్మించారు. ఈ ఇద్దరు ఇంజనీర్ల పేర్లు అయినా జాక్, తాల్ ప్రేరణ పొందిన ఈ ప్రదేశం తరువాత జగిత్యాల అని పిలిచేవారని స్థానికులు అంటున్నారు. ఈ కోట జాక్ తాల్ కోటగా ప్రసిద్ధి చెందింది. జగిత్యాల కోట రాయి సున్నంతో కట్టబడిన నక్షత్ర ఆకారపు డిజైన్‌లో ఉంటుంది. చుట్టూ లోతైన కందకం ఉండి ఆ కందకం ఇప్పటికీ నీటితో నిండి ఉంటుంది. 277 సంవత్సరాలు గడిచినా కోట చెక్కు చెదరలేదు. కోటలో నిర్మించిన కోనేరు ఎప్పటికీ నీటితో కలకల్లాడుతూనే ఉంటుంది. కోట లోపల మందుగుండు సామగ్రి నిల్వ చేసుకోవడానికి నిర్మించిన గదులున్నాయి. ఈ గదుల సమీపంలో వెనుక ద్వారం ఉందంటున్నారు.


● నక్షత్ర ఆకారపు కోట...

రాష్ట్రంలో నక్షత్ర ఆకారపు కోటగా జగిత్యాల ఖిల్లా గుర్తింపు పొందింది. మొఘల్ రాజవంశంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం హయాంలో దీనిని నిర్మించారు. కోటకు రెండు చెక్క ద్వారాలు ఉన్నాయి. మొఘల్ సార్వభౌమాధికారంలో గవర్నర్ నవాబ్ ఇబ్రహీం పాలనలో నిర్మించబడిన ఈ కోట అత్యంత శక్తివంతమైన రాజవంశం ముద్రను కలిగి ఉంది. ఇది 264 మీటర్ల ఎత్తులో నిర్మించబడింది. దాని చుట్టూ



జగిత్యాల ఖిల్లా

మోతే చెరువు, ధర్మ సముద్రం చెరువు, ముపారపు, కండ్లపల్లి చెరువు అనే నాలుగు నీటి వనరులు ఉన్నాయి. కోట ప్రాంగణం అంతటా చెల్లాచెదురుగా ఉన్న భారీ ఫిరంగుల ఉనికి ద్వారా కోట అజేయంగా ఉన్న రోజులను ఇప్పటికీ గుర్తుచేస్తుంది. విదేశీ ప్రభావం కారణంగా ఈ కోట ఐరోపా కోటతో బలమైన పోలికను కలిగి ఉందన్న అభిప్రాయాలున్నాయి. జగిత్యాల ఖిల్లా ప్రత్యేక ఆకృతి, నిర్మాణం పలువురిని ఆకర్షింపజేస్తోంది. పాఠశాల, కళాశాల విద్యార్థులతో జిల్లాలో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేసి పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఇటీవల ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మూడో బహుమతి దక్కింది. జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, పర్యాటక శాఖ అధికారులు ఖిల్లా అభివృద్ధిపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.





నక్షత్ర ఆకారంలో నిర్మించిన కోట వ్యూ

మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

- నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అతిథులు

గణేశ్‌నగర్,అక్టోబర్ 22:(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. మై భారత్- నెహ్రూ యువ కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో మంగళవారం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కరీంనగర్ ఎక్సైజ్ సూపరింటెండ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్నటువంటి సమస్య అని అందులో మనదేశం కూడా ఉందన్నారు. ఇది చాలా ప్రమాదకరమైన అంశమని యువత దీనికి అలవాటు పడితే భవిష్యత్తు పాడవుతుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు, డ్రగ్స్ వినియోగంలో యువత శాతం ఎక్కువగా ఉంటుందని అలాంటి వారితో దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ తీసుకునే వారి మానసిక స్థితి సరిగ్గా ఉండదని అలాంటప్పుడు వివిధ నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అన్నారు. ఎవరైనా మాదకద్రవ్యాలు వాడితే తమ టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ నాగార్జున, శ్రీనివాస్, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్, ఎం వెంకట్ రాంబాబు, డిస్ట్రిక్ యూత్ ఆఫీసర్ నెహ్రూ యువ కేంద్రం, రాములు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎక్సైజ్ శాఖ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సైకాలజిస్ట్ జక్కని రాజు మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత ఎదుర్కొంటున్న వివిధ మానసిక సమస్యలు, నివారణ గురించి వివరించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలిరాగా స్వామివారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



ఆలయ ఆవరణలో భక్తులు

వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు

గణేశ్‌నగర్, అక్టోబరు22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రాంనగర్‌లోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో కంప్యూటర్, బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభం అవుతున్నట్లు జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి గల యువతీ యువకులు శిక్షణ కేంద్రంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించి మీ పేర్లు నమోదు చేసుకోగలరని తెలిపారు. నైపుణ్య శిక్షణకు అర్హులు ఏడవ తరగతి ఆ పైబడిన తరగతి పాసైన, ఫెయిల్ అయిన 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలియజేశారు. మూడు నెలల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కోర్సు ఫీజు వివరాలు కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్, డిటిపి)కి వెయ్యి రూపాయలు, బ్యూటీషియన్ కోర్సుకు 1500 రూపాయలు ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9640967943, 9949850360 నంబర్లలో సంప్రదించాలన్నారు.

హైబ్రిడ్ వంగడాలపై అవగాహన

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు హైబ్రీడ్ వరి వంగడాలు, వాటి ఉత్పాదకతపై వ్యవసాయ సంచాలకుల కార్యాలయం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కరీంనగర్ మండలం చామనపల్లి రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శాస్త్రవేత్త డాక్టర్ దామోదర్ రాజు, వరి శాస్త్రవేత్త డాక్టర్ వీరన్నలు అవగాహన కల్పించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, ఏఈవోలు సుచరిత, స్వర్ణలత, ఉదయ్, పైడితల్లి, డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు వరి వంగడాలు, ఉత్పత్తులు, పత్తి సాగుపై అవగాహన కల్పించారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఆనంది

కమాన్‌పూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నల్లవెల్లి ఆనంది జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతోంది. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరగనున్న 39వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా కోచ్ రమేష్, రవీందర్ తదితరులు అభినందనలు తెలిపారు.

గ్రామోద్యోగ్ వికాస్ యోజనను సద్వినియోగం చేసుకోవాలి

- కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి



మాట్లాడుతున్న ఎన్ లతాదేవి

జగిత్యాల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ సూక్ష్మ, చిన్న తరహా సంస్థల పరిధిలో గల ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గ్రామోద్యోగ్ వికాస్ యోజనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేవీఐసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్ లతాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలోని గోవిందుపల్లిలో గల వీకేబీ ఫంక్షన్ హాలులో నిర్వహించిన విలేజ్ ఇండస్ట్రీస్ అక్టివిటీస్ గ్రామోద్యోగ వికాస్ యోజన 2024-25 కార్యక్రమంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ డీజీ ప్రసాద్‌శర్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఎన్ లతాదేవీ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ అంజనాదేవీ పలు అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా సీనియర్ ఎగ్జిక్యూటివ్ లతాదేవీ మాట్లాడుతూ ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక ఆధునీకీకరణ, శిక్షణ మొదలైన వాటిని అందించడం ద్వారా గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం గ్రామోద్యోగ్ వికాస్ యోజనను అమలు చేస్తుందన్నారు. 2024-25 సంవత్సరా నికి పథకం కింద అర్హత ఉన్న వ్యక్తులకు అందించడానికి అవసరమైన పనులు చేస్తున్నామన్నారు. ఇందులో శిక్షణ, సాధనాలను అందించడం జరుగుతుంద న్నారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు చేతి వృత్తులకు చెందిన వ్యక్తులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, చిన్న వ్యాపారులు పాల్గొన్నారు.

మూడు జాముల కొదురుపాక



గుట్టల మధ్య ఉన్న కొదురుపాక గ్రామం


- సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో తేడా
- 'గుట్టల' కారణంగానే ప్రత్యేక గుర్తింపు

తెలంగాణలోని పల్లెల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం ఇంచుమించు ఒకే సమయంలో ఉంటాయి. సాధారణంగా ఉదయం ఆరు గంటలకు సూర్యోదయం అయితే, సాయంత్రం ఆరు గంటలకు సాయంత్రం అవుతుంది. కానీ తమ గ్రామంలో మాత్రం ఒక గంట ఆలస్యంగా సూర్యోదయం అవుతుంది. అలాగే మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే తమ గ్రామంలో సూర్యాస్తమయం అవుతుందని ఆ ఊరి ప్రజలు చెబుతారు. అదే తమ గ్రామ ప్రత్యేకత అంటూ గర్వంగా చెప్పుకుంటారు.

సుల్తానాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా తెలంగాణలోని పల్లెల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి అంటూ నాలుగు జాములను చెబుతారు.. కానీ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో మూడు జాములే ఉంటాయి.



తూర్పున ఉన్న గొల్లగుట్ట



పడమరన ఉన్న రంగనాయకుల గుట్ట

కానీ అందరూ నాలుగో జాము చూసే సమయంలో ఆ గ్రామ ప్రజలు రాత్రిని చూస్తున్నారు. ఇలా ఆ గ్రామ ప్రజలు మూడు జాముల(ఉదయం, మధ్యాహ్నం, రాత్రి)కే పరిమితమవుతున్నారు. ఈ గ్రామం చుట్టూ పెద్దపెద్ద గుట్టలు ఉండడమే ఇందుకు కారణం.. సుమారు 2వేల జనాభాగల కొదురుపాక గ్రామం 'మూడు జాముల కొదురుపాక' గానే ప్రపంచానికి తెలుసు.. అన్ని గ్రామాల్లో కంటే విభిన్నంగా గంట ఆలస్యంగా ఇక్కడి ప్రజలు సూర్యోదయాన్ని చూస్తారు. అంతటా సాయంత్రం ఆరు, ఏడు ప్రాంతంలో చీకట్లు అలుముకుంటే ఈ గ్రామంలో మాత్రం మధ్యాహ్నం మూడు, నాలుగు గంటలకే చీకటి పడుతుంది. పనుల మీద ఎవరైనా ఎక్కడికైనా వెళితే ఠంచనుగా ఇంటికి చేరుకుంటారు. కారణం.. కొదురుపాక గ్రామం చుట్టూ నాలుగు వైపులా ఎత్తయిన గుట్టలు ఉన్నాయి. తూర్పున గొల్ల గుట్ట, పడమరన రంగనాయకుల గుట్ట, దక్షిణాన పాము గుట్ట, ఉత్తరాన నంబులాద్రి గుట్టలు ఉన్నాయి. వీటి మధ్య కొదురుపాక గ్రామం ఉంది. సూర్యుడు ఉదయించే సమయంలో గొల్లగుట్ట అడ్డుగా ఉండడం వల్ల గంట పాటు సూర్యోదయం ఆలస్యంగా అవుతుంది. అలాగే సూర్యుడు అస్తమించే పడమర వైపున రంగనాయకుల గుట్ట అడ్డుగా ఉండటంతో మధ్యాహ్నం మూడునాలుగు గంటలకే గ్రామం చీకటిమయం అవుతుంది. ఇలా మూడు జాములకే పరిమితం అవడం వల్ల ఈ గ్రామానికి 'మూడు జాముల కొదురుపాకగా గుర్తింపు వచ్చింది.

గంట ఆలస్యంగా సూర్యోదయం..

-చాతరాజు రమేష్, యువకుడు, కొదురుపాక



మా గ్రామానికి తూర్పున ఉన్న గొల్లగుట్ట వల్ల సూర్యోదయం గంట ఆలస్యంగా అవుతుంది. అలాగే పడమర వైపున ఉన్న రంగనాయకుల గుట్టవల్ల సూర్యుడు పడమటి వైపు వెల్లగానే చీకటి అలుముకుంటుంది. ఇలా మా గ్రామానికి 3 జాములే ఉన్నాయి. అదే మా గ్రామ పేరుకు జతగా నిలిచి మూడుజాముల కొదురుపాకగా పేరుతెచ్చుకుంది. గుట్టల నడుమ గ్రామం ఉండటం వల్ల నాలుగో జామును ఇక్కడి ప్రజలు చూడలేకపోతున్నారు.

డీఏ ఉత్తర్వులు విడుదల చేయాలి

భగత్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన కరువుభత్యం డీఏ ఉత్తర్వులు వెంటనే విడుదల చేయాలని బీజేపీ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల రాష్ట్ర సెల్ కో-చైర్మన్ బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఆశావాహ అభ్యర్థి నరహరి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు.

నియామకం

భగత్‌నగర్, అక్టోబరు 22: పట్టభద్రుల ఎమ్మెల్సీ కరీంనగర్ జిల్లా బీజేపీ ఎన్‌రోల్ మెంట్ ఇన్‌ఛార్జిగా నరెడ్ల ప్రవీణ్‌రెడ్డిని నియమించి నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 2025లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పట్టభద్రుల ఎన్‌రోల్‌మెంట్ ఇన్‌ఛార్జిగా తనకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లాకేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ విద్యార్థి పి.ఫ్రానిక్ రతన్ ఎంపికయ్యాడు. ఈనెల 21న జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ రాజ్‌కుమార్ తెలిపారు. .

కవిత ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22: రచయిత, సామాజికవేత్త, మానవ విలువల పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు నాగుల సత్యంగౌడ్ పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా రచించిన 'పోలీసు అమర వీరులు పోషించిన పాత్ర-తరతరాలకు తరగని చరిత్ర' కవితను మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు.

పారమితలో మేధో సంపత్తి దినోత్సవం

భగత్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో మేధో సంపత్తి దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నితిన్‌తివారి, హెడ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ గ్రూప్, ఐపీఆర్ లైసెన్సింగ్ ఎగ్జిక్యూటివ్ నిధిచద్దా, పాఠశాల చైర్మన్ ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, డైరెక్టర్ హన్మంతరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూపులు

-అకాల వర్షాలతో రైతుల ఆందోళన -తక్షణమే కొనుగోళ్లు చేపట్టాలని వినతి

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలంలో వరి కోతలు మొదలైనప్పటికీ కొనుగోళ్లు మాత్రం ప్రారంభం కాక పోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు వరి ధాన్యాన్ని తీసుకువచ్చి కుప్పలు పోసి వర్షాలకు తడవకుండా పరదాలు కప్పి ఉంచి కొనుగోళ్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కరీంనగర్ మండలంలో ఈ వర్షకాలం సీజన్‌లో 12,900 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. 2వేలకు పైగా సన్న రకం వడ్లను సాగు చేశారు. 500బోనస్ ప్రభుత్వం ప్రకటించడంతో ఈ యేడు ఎక్కువగా సన్న రకం సాగు చేసినప్పటికీ దోమపోటుతో ఇబ్బందులకు గురవు తున్నారు. ఈయేడు ఏ-గ్రేడ్ ధాన్యానికి 2,320 రూపాయల మద్దతు ధర కాగా, కామన్ గ్రేడ్‌కు 2,300 రూపాయలు ప్రకటించడంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు.



నగునూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

కరీంనగర్ మండలంలో సోమవారం రాత్రి కురిసిన ఆకాల వర్షం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. మండలంలో సోమవారం అర్ధరాత్రి చామనపల్లి, తహెర్ కొండాపూర్, మొగ్దుంపూర్, చెర్లబూత్కూర్, దుబ్బపల్లి గ్రామాల్లో ఒక్కసారిగా వర్షం కురిసింది, మొగ్దుంపూర్, చెర్లబూత్కూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తడిచిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మండల రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి
-శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తేమ శాతం చూడకుండా కొనుగోలు చేయాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల వడ్లకు 500 రూపాయల బోనస్‌ను ఇవ్వాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి.

'ప్రతి దుకాణానికి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి'

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని దుకాణాలకు విధిగా ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. మంగళవారం ఆమె నగరంలోని గాంధీరోడ్డులోని శ్రీరామా ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్లి ట్రేడ్ లైసెన్సును పరిశీలించారు. దుకాణ కొలతల్లో తేడా ఉండడంతో ట్రేడ్ లైసెన్సు ఫీజు తక్కువగా చెల్లిస్తున్నట్లుగా గుర్తించి 25శాతం పెనాల్టీ వేశారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

●నగరంలోని శ్మశానవాటికలను శుభ్రంగా ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కిసాన్‌నగర్ శ్మశానవాటికను సందర్శించారు. దీపావళి సందర్భంగా దళితులు శ్మశానవాటికలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహి స్తారని, అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్థిక, సామాజిక, రాజకీయ అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్న దూదేకుల కులస్తుల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం దూదేకుల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.200 కోట్లను కేటాయించాలని దూదేకుల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. మంగళవారం హైదరాబాద్‌లో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు దూదేకుల జేఏసీ ప్రతినిధులు ఎం.డి.అజీమొద్దీన్, ఎం.డి.మోయినుద్దీన్, వసీం అహ్మద్, అహ్మద్‌హుస్సేన్, మహమూద్ అలీ, బడేషాబ్ సుబాన్, అలీ సమద్ రజాక్, ఆరీఫ్, నజీర్ తెలిపారు.

ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధిహామీ పనులపై మంగళవారం మొగ్దుంపూర్ గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధిహామీ ఏపీవో శోభరాణి హాజరయ్యారు. ఈసందర్భంగా గ్రామంలో చేపట్టబోయే పనుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో టీఏ రమదేవి, పిఏస్ శ్రావణి, ఎఫ్ఏ సురేష్, కార్యదర్శి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడీలను కేటాయించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో నియామకమైన ఉపాధ్యాయులకు త్వరితగతిన ట్రెజరీ ఐడీలను కేటాయించాలని ఎస్టీయు జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్, కట్ట రవీంద్రచారి కోరారు. ఈమేరకు మంగళవారం వారు జిల్లా ట్రెజరీ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

కుల గణనపై పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టబోయే కుల గణన ప్రక్రియపై కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో మండల కార్యదర్శులతో ఎంపీడీవో సంజీవరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో జగన్మోహన్ రెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడల్లో తేజస్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న తేజస్ చైర్మన్ సతీష్‌రావు

భగత్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో తేజస్ జూనియర్ కళాశాల, డిఫెన్స్ అకాడమి విద్యార్థులు ప్రతిభ చాటి విజేతలుగా నిలిచారు. మంగళవారం కళాశాల ఆవరణలో క్రికెట్‌లో విజేతలుగా నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఎండి అలీమొద్దీన్, పి యోగేశ్వర్‌లను కళాశాల చైర్మన్ సిహెచ్ సతీష్‌రావు అభినందించారు.

నత్తనడకన 'ఎల్ఆర్ఎస్'

(5వ పేజీ తరువాయి)

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ముందుగా సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ పరిశీలించి నిబంధనల ఆధారంగా వాటిని వడపోస్తుంది. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉంటే గుర్తించి దరఖాస్తుదారులకు సమాచారం పంపుతుంది. అలాగే దరఖాస్తుదారులు పూర్తిస్థాయి పత్రాలు ఇవ్వకుంటే వాటిని సమర్పించాలనే సమాచారాన్ని ఇస్తుంది. అనంతరం దరఖాస్తులను రెవెన్యూ, నీటిపారుదల, టౌన్‌ప్లానింగ్, పంచాయతీ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుంది. రెండో దశలో నిర్ధారిత ఫీజు చెల్లించాల్సిందిగా నోటీసు జారీ చేస్తారు. అలాగే అనర్హత కలిగిన దరఖాస్తులను తిరస్కరిస్తారు. మూడో దశలో దరఖాస్తుదారులు ఫీజు చెల్లించి అవసరమైన పత్రాలను సమర్పిస్తే మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ఇళ్ల నిర్మాణాలకు అనుమతి ఇస్తారు. అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ఆధ్వర్యంలోని అధికారులు వాటిని పరిశీలించి లే అవుట్ పర్మిషన్లను జారీ చేస్తారు. వివిధ శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం, దరఖాస్తుదారుల నుంచి స్పందన లేకపోవడంతో ఎల్ఆర్ఎస్ ముందుకు సాగడంలేదు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో ఎల్ఆర్ఎస్‌పై సమీక్ష నిర్వహించి డిసెంబర్‌లోగా క్లియర్ చేయాలని ఆదేశించారు. దీనితో అధికారులు ఎల్ఆర్ఎస్‌పై దృష్టి సారిస్తున్నారు. రెండున్నర నెలల్లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులెన్ని పరిష్కరిస్తారో చూడాలి.

నాయీ బ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా మొండయ్య



జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

సుభాష్‌నగర్, అక్టోబరు22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షునిగా నీలం మొండయ్యను ఎన్నుకున్నారు. మంగళవారం సంఘం ఎన్నికలను నిర్వహించారు. జిల్లా అధ్యక్షునిగా నీలం మొండయ్య, ప్రధాన కార్యదర్శిగా జంపాల సంపత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పాల్వాయి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు పసుల మోహన్, ఉపాధ్యక్షుడు యు రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కోడిచెర్ల రమేశ్ పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తా'

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన నగరంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను సందర్శించి పట్టభద్రులంతా ఓటరు నమోదు చేసుకోవాలని కోరుతూ నమోదు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు.

'నిరుద్యోగుల సమస్యలపై అవగాహన ఉంది'

సుభాష్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పట్ల తనకు అవగాహన ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 10 సంవత్సరాలుగా లెక్చరర్‌గా పనిచేస్తున్నాని, నిరుద్యోగుల కష్టాలు తనకు తెలుసన్నారు. తెలంగాణలో సమాజ అభివృద్ధికి మెరుగైన, నాణ్యమైన ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నదే తన లక్ష్యమన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 22: మాడ్రన్ ఆక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ (మాస్క్) ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలను నాటక, సినిమా, సీరియల్స్, షార్ట్ ఫిల్మ్ కళా రంగాల్లో ప్రోత్సహించడానికి సంబంధించిన ఉచిత నటనా శిక్షణా శిబిర పోస్టర్‌ను మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్‌లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలసి ఆవిష్కరించారు. నవంబరు 10వ తేదీ నుంచి 8 ఆదివారాలు శిక్షణ ఉంటుందని మాస్క్ చైర్మన్, ఆక్టింగ్ కోచ్ అనసూరి భూనాథాచారి కలెక్టర్‌కు వివరించారు. నవంబరు 5లోగా 8801565909, 9440215199 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ షార్ట్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేశ్, మాస్క్ కో ఆర్డినేటర్ వంగల శ్రీధర్ పాల్గొన్నారు.

'క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది'

భగత్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో ఎస్‌జీఎఫ్ అండర్-19 చెస్, వాలీబాల్, జూడో, ఉషు పోటీలను అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ విద్యార్థులకు విద్యార్థి దశ నుండే నిపుణులైన అనుభవజ్ఞులైన వ్యాయామ ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి కరీంనగర్ జిల్లాల్లోని క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. ఈకార్యక్రమంలో పీడీలు సరిత, సుష్మ, రాజశేఖర్, చందు, నారాయణ, విష్ణు, జూడో అఫిషియల్స్ ఎల్విరమణ, సిమహేందర్, ఎం శ్రీధర్, సాయిచందర్, సాయిరామ్ యాదవ్, శ్యామ్, యోగ అఫీషియల్స్ వి కిష్టయ్య, రామకృష్ణ, ఆనంద్‌కిషోర్, స్వరూపచారి, ప్రవీణ్, ఉషు అఫిషియల్స్ విద్యాసాగర్, విక్రమ్, శ్రీనివాస్, వాలీబాల్ అఫిషియల్స్ శ్రీనివాస్, సతీష్, అశోక్, చెస్ అఫిషియల్స్ అనూప్‌కుమార్, సుజన్, కె అరుణ్, ఆర్ రేవిక, నితన్, పాఠశాల ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులుపాల్గొన్నారు.



జూడో పోటీలను ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

కరాటేలో 'అద్వితీ' విద్యార్థి ప్రతిభ



విద్యార్థి విశ్వక్‌సేన్‌ను అభినందిస్తున్న అద్వితీ డైరెక్టర్ అనుదీప్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి) ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు నగరంలోని అద్వితీ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థి విశ్వక్‌సేన్ ఎంపికయ్యాడు. ఇటీవల గోదావరి ఖనిలో నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన విశ్వక్‌సేన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల డైరెక్టర్ సొగాని అనుదీప్‌తో పాటు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడిగా చందు



చొప్పదండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నిజానపురం చందు నియమితులయ్యారు. ఈ మేరకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియమకపు ఉత్తర్వులను జారీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని, పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా దళిత వర్గానికి చెందిన ఎం కుమార్‌ను నియమించడంపై సందర్భంగా మండల ఎస్సీ సెల్ నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి దళితుడిని వీసీగా నియమించినందుకు గాను రాష్ట్ర మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కనకం అశోక్, కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోండ్ర సురేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ జీడి శ్యామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని

సైదాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మోడల్ స్కూల్ విద్యార్థిని అఖిల హాకీ, సాఫ్ట్‌బాల్ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ విష్ణువర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ నెల 18,19వ తేదీల్లో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం, శాతావాహన యూనివర్సిటీలో ఎస్‌జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా హాకీ, సాఫ్ట్ బాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో అఖిలను ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

రామడుగు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు న్యాయపరంగా రావాల్సిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి వేణుకుమార్ అన్నారు. మంగళవారం రామడుగు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల మూలంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరించాలన్నారు. నిరసనలో ఉపాధ్యాయులు మంజుల, వనితకుమారి, మంజుశ్రీ, సమ్మయ్య, చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, జలపతిరెడ్డి, రాజమహేందర్ తదితరులు ఉన్నారు.

'ఎల్ఎండీ' నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

తిమ్మాపూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): దిగువ మానేరు జలాశయం రెండు ప్రధాన గేట్ల నుంచి దిగువకు నీటి విడుదల మంగళవారం కూడా కొనసాగింది. ఎల్ఎండీ పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం అంతే మొత్తంలో 24.034 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఎంఎంఆర్ నుంచి 4,300 క్యూసెక్కులు, ఎగువ కాకతీయ కాలువ నుంచి 2,000 క్యూసెక్కులు మొత్తం 6,300క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వచ్చి చేరుతోంది. ఎల్ఎండీ రెండు గేట్ల నుంచి 6,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథ, ఆవిరి రూపంలో 280 క్యూసెక్కుల నీరు మొత్తం 6,280 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో వెలుతున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

మిల్లర్లు తరుగు పేరిట కొర్రీలు పెడితే సహించేది లేదు

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్/శంకరపట్నం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో తరుగు పేరిట రైస్ మిల్లర్లు కొర్రీలు పెడితే సహించేది లేదని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం శంకరపట్నం మండలంలోని తాడికల్, మొలంగూర్, గద్దపాక, ఆముదాలపల్లి, మెట్‌పల్లి, లింగాపూర్, కొత్తగట్టు, తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, నల్లగొండ, మక్తపల్లి, పర్లపల్లి, అలుగునూర్ గ్రామాల్లో సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అలాగే మొలంగూర్‌లో ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించడంతో పాటు కేశవపట్నంలోని ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం వాహనాల్లో డోడ్ అయిన వెంటనే రైతులకు ట్రక్ షీట్లు ఇవ్వాలన్నారు. రైతులు ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుజాత, టీపీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శంకరపట్నం, తిమ్మాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపగోని బసవయ్య, మోరపల్లి రమణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు పొద్దుటూరి సంజీవరెడ్డి, గుర్రాల తిరుపతిరెడ్డి, కేతిరి మధుకర్‌రెడ్డి, , డీసీఎంఎస్ డైరెక్టర్ అలువాల కోటి తదితరులు పాల్గొన్నారు.





కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

● కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గంగాధర/రామడుగు (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు పొందాలని ఎమ్మెల్యే మేడి పల్లి సత్యం అన్నారు. మంగళవారం గంగాధర మండ లం మధురానగర్, మంగపేట, నారాయణపూర్, రామడుగు మండలంలోని రామడుగు, గుండి, గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మేడిపల్లి సత్యం మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అనంతరం కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ 62 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఆయన వెంట గంగాధర, రామడుగు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు జాగిరపు రజితశ్రీనివాస్‌రెడ్డి, బొమ్మరవేని తిరుమల తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్లు వీర్ల వెంకటేశ్వరరావు, బాలగౌడ్, ఉపాధ్యక్షుడు వేముల భాస్కర్, ఏఎంసీ ఉపాధ్యక్షుడు కర్ణాకర్ పాల్గొన్నారు.

గాలికుంటు నివారణ టీకాలను వేయించాలి

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 22: పాడి పశువులకు రైతులు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని జిల్లా పశు, సంవర్థక శాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపేటలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమానికి హజరయ్యారు. పశువులు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు రైతులు టీకాలను వేయించాలన్నారు. కార్యక్రమంలో సింగాపూర్ పశువైద్యాధికారి డాక్టర్ పి రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఇద్దరిపై అట్రాసిటి కేసు

మానకొండూర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరిపై మంగళవారం అట్రాసిటి కేసు నమోదు అయింది. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం తిమ్మాపూర్ మండలంలోని మొగిలిపాలెం గ్రామానికి చెందిన ఎల్కపల్లి సంపత్ ఈ నెల 14న రాత్రి మోటార్ సైకిల్‌పై తన మిత్రుడని కలిసి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గంగిపల్లికి చెందిన బండ నరేందర్‌రెడ్డి, బండ రాజిరెడ్డి దాడికి పాల్పడ్డట్లు సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

చొప్పదండి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి) :ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చొప్పదండిలోని రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సలహాలు,సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి వంశిక్రిష్ణఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

'జీవో నంబరు 29ను రద్దు చేయాలి'

హుజూరాబాద్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జీవో నంబరు 29తో బీసీలకు అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని బీసీ అజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రూప్-1 నియామకాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌తో బీసీలకు నష్టం జరుగుతుందన్నారు.

తెలంగాణ లో జరుగుతున్న ప్రతీ ఉద్యోగ నియామకాల్లో పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. బీసీలందరూ ఐక్యం గా ఉండి పోరాడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మకై బీసీలకు నష్టం చేసేలా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా శ్రీనివాస్‌ను నియమించారు. కార్యక్రమంలో రేవంత్, రామచంద్రం, సాగర్, రుతిక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జక్కని సంజయ్‌కుమార్

రైల్వే బాధితులందరికీ పరిహారం: ఆర్డీవో

గంగాధర, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వే లైను నిర్మాణంలో భూములు కోల్పోతున్న బాధితులందరికీ పరిహారం అందిస్తామని ఆర్డీవో మహేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని గర్షకుర్తి రైతు వేదికలో రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గర్షకుర్తి గ్రామ శివారులో 43.34 ఎకరాల వ్యవసాయ భూమి కొత్తపల్లి, మనోహర బాద్ రైల్వేలైను కింద పోతున్న భూములు గల రైతుల పేర్లను గ్రామ సభలో చదివి వినిపించారు. ఎవరైనా లిస్టులో పేర్లు తప్పి ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, ప్రత్యేకాధి కారి వినయ్, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

●హుజూరాబాద్‌రూరల్: పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల బీజేపీ ఎన్‌రోల్‌మెంట్ ఇన్‌చార్జి గా చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి నియమిస్తూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

●సైదాపూర్: పొలాల వద్ద ఉన్న పశువుల లేగదూడలకు చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ విజేందర్‌రావు సూచించారు.

●తిమ్మాపూర్: నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని టీచర్ ఎమ్మెల్సీ ఆశావహ అభ్యర్థి పోలు సత్యనారాయణ కోరారు. మండలంలోని అలుగునూర్‌లోని టీఎస్ఆర్‌డబ్ల్యుఎస్, ఎల్ఎండీ కాలనీలోని హైస్కూల్, తెలుగు, ఉర్దూ మీడియం, సెయింట్ ఆంథోని పాఠశాల, జ్యోతిష్మతి, వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలలలో ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిశారు.

- స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ వారు సంయుక్తంగా రెండు రోజుల టెక్నికల్ సింపోజియం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల జనరల్ సెక్రటరీ జి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. టెక్నికల్ సింపోజియం కార్యక్రమం మంగళవారం ప్రారంభించినట్లు తెలిపారు.

●హుజూరాబాద్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న డీఏలను ప్రభుత్వం విడుదల చేయాల ని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల గెజిటెడ్ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ముజాహిద్ హుస్సేన్ సీఎం రేవంత్‌రెడ్డికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

●కరీంనగర్ స్పోర్ట్స్: హిమాచల్ ప్రదేశ్ ధర్మశాల జాతీయ అడ్వెంచర్ క్యాంపులో మంగళవారం మొదటి రోజు శాతవాహన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శిక్షణ పొందారు. 60 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృంద నాయకుడిగా శాతవాహన యూనివర్సిటీకి చెందిన రాజు ఎంపిక య్యాడని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి తెలిపారు.

●కరీంనగర్ కల్చరల్: మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ వాల్మీకి జయంతి సందర్భంగా ఈనెల 30న హైదరాబాద్‌లో నిర్వహించే వేడుకల్లో నగరానికి చెందిన కవి, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్‌కు సాహితీ సేవారత్న పురస్కారం అందజేయనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ వి రాజగోపాల్, అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.